సాక్షి
ఆదిలాబాద్

శనివారం : 13 : ఏప్రిల్ : 2024



'ఇంద్రాదేవి'..సమస్యలమయం

ఇంద్రాదేవి ఆలయంలో సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాలు లేక పూజలకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 10లో▸



సమయం లేదు మిత్రమా..!

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వచ్చేనెల 13న జరగనుంది. అర్హులైన వారు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు గడువు సమీపిస్తుంది. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /24.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత తగ్గనుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సోయాబీన్ డబ్బులు రూ.27.63 కోట్లు విడుదల

కైలాస్‌నగర్: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేసిన సోయాబీన్ డబ్బులు రూ.27.71 కోట్లలో ప్రభుత్వం రూ.27.63 కోట్లు విడుదల చేసిందని ఆ సంస్థ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇందులో ఇప్పటివరకు విడతల వారీగా 1,448 మంది రైతులకు రూ.11.48 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. వరుస సెలవుల కారణంగా చెల్లింపుల్లో కొంత జాప్యం అయినట్లు తెలిపారు. మిగిలిన రూ.16.15 కోట్ల నిధులు సైతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన రూ.8.87లక్షలు విడుదలైన వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ఈనెల 16 వరకు ఓపిగ్గా ఉండి తమకు సహకరించాలని కోరారు.

16న జిల్లాకు కేటీఆర్



మాట్లాడుతున్న జోగు రామన్న

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల సన్నాహకంలో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 16న జిల్లా కేంద్రానికి రానున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని గాయత్రీ గార్డెన్‌లో నిర్వహించే సమావేశంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అనుసరించాల్సిన విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ పర్యటనకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గోవర్ధన్, రమేశ్, మనోహర్, నర్సింగ్‌రావు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి

కైలాస్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల 14లోగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వరకు 18ఏళ్లు నిండిన యువత ఫారం–6 నింపి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లోనూ ఆధార్, ఎస్సెస్సీ మార్కుల మెమో ఆధారంగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ మే 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు ఓటు వేసేలా చూడాలని కోరారు. జాబితాలో ఓటు ఉన్నది లేనిది పరిశీలించుకొని, లేని పక్షంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం

- హాజరుకానున్న మురళీధర్‌రావు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల సన్నాహకంలో భాగంగా ఈ నెల 13న బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గాయత్రీ గార్డెన్‌లో మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించనున్న సమావేశానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే బీజేఎల్‌పీ నేత మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, హరీశ్ బాబు సైతం హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మావోయిస్టుల సమాచారం అందించండి



వాల్‌పోస్టర్ అతికిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా ప్రజలు మావోయిస్టుల సమాచారం అందించాలని కోరుతూ మావల పోలీసులు వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ మేరకు శుక్రవారం పోలీసు స్టేషన్ పరిధిలో వాటిని అతికించారు. 'మావోయిస్టుల సమాచారం అందించండి.. బహుమతి పొందండంటూ' ప్రచారం చేపట్టారు.

ఆపరేషన్ ఆకర్ష్

- కాంగ్రెస్, బీజేపీల్లోకి చేరికలు
- బీఆర్‌ఎస్ నుంచే వలసలు
- త్వరలో పలువురు కౌన్సిలర్లు జంప్?
- జూన్‌లో స్థానిక ఎన్నికలు ఉంటాయనడంతో పెరిగిన కప్పదాట్లు



సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రెండూ ఆపరేషన్ ఆకర్ష్ మంత్రం జపిస్తున్నాయి. జిల్లాలో ముఖ్య, ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తల చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో మండలాల్లో పలు చోట్ల ఆయా పార్టీల్లో చేరికలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్‌ఎస్ నుంచి జిల్లాలోనూ వలసలు జోరందుకున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్‌లోని ముఖ్యనేతలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం ద్వితీయ శ్రేణి నేతలపై ఫోకస్ పెరిగింది. వారి చేరికలను ఈ అధికార పార్టీలు ప్రోత్సహిస్తున్నాయి.

జంప్‌కు ప్రణాళిక..

నార్నూర్ బీఆర్‌ఎస్ నేత, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ కాంగ్రెస్‌లో చేరనున్నారు. బీఆర్‌ఎస్ ఏర్పడినప్పటి నుంచి అందులోనే ఉన్నటువంటి గజానంద్ క్రియాశీలక రాజకీయాలు నడుపుతున్నారు. కేసీఆర్‌తో సాన్నిహిత్యం ఉన్న ఈ నేత ప్రస్తుతం పార్టీ ఉన్న పరిస్థితుల నేపథ్యంలో వీడేందుకు సిద్ధమయ్యారు. త్వరలో హైదరాబాద్ వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరనున్నట్లు ప్రచారం ఉంది. అలాగే ఆదిలాబాద్ మున్సిపాలిటీకి చెందిన 8 నుంచి 10 మంది కౌన్సిలర్లు త్వరలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. దాంట్లో బీఆర్‌ఎస్‌తో పాటు ఒకరిద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు ఉన్నారని చెప్పుకుంటున్నారు. ఇందులో ఒకరు ప్రస్తుతం కౌన్సిలర్‌గా ఉంటూనే బీసీ సంఘంలో క్రియాశీలక నేతగా ఉన్న వ్యక్తి అని అంటున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పాలకవర్గం బీఆర్‌ఎస్ చేతిలో ఉండగా, ఇక్కడ అవిశ్వాసం పెట్టాలని ప్రయత్నాలు కాంగ్రెస్ చేస్తుందనే ప్రచారం సాగుతుంది. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ల చేరిక ప్రాధాన్యత సంతరించుకుంటుంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ఒకరిద్దరు కౌన్సిలర్లు బీజేపీలో చేరనున్నట్లు కూడా ప్రచారం సాగుతుంది. మంత్రి సీతక్క సమక్షంలో ఇటీవలే ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. మొత్తంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 24 సంఖ్య బలం ఉన్న బీఆర్‌ఎస్‌లో గతంలో ఇద్దరు స్వతంత్రులతో కలుపుకొని 26 మందితో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. తాజాగా పలువురు కౌన్సిలర్లు ఈ పార్టీ నుంచి జంప్ అవుతుండడంతో క్రమంగా బలహీన పడుతోంది.

జూన్‌లో 'స్థానిక' ఉంటాయనడంతో..

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భువనగిరి నియోజకవర్గ సమీక్షలో జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని చెప్పడం ప్రస్తుతం చేరికల జోరును మరింత పెంచింది. ప్రధానంగా ఈ పోరును ఒకే దఫాలో పూర్తి చేసేలా యోచిస్తున్నట్లు ప్రచారం జరిగింది. తద్వారా సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్ చైర్మన్ల ఎన్నిక కూడా వడివడిగా చేసే ఆలోచన ఉన్నట్లు చర్చ సాగుతుండడంతో మండలాల్లో పలువురు ద్వితీయశ్రేణి నాయకులు అధికారంలో ఉన్న పార్టీల్లో తమకు అనువైనది ఎంచుకొని అందులో సర్దుకు పోయేందుకు సిద్ధమవుతున్నారు. దీంతోనే ప్రస్తుతం అన్నిచోట్ల చేరికల సందడి కనిపిస్తుందని చెబుతున్నారు.

భూసార పరీక్షలేవి?



భూసార పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

- నాలుగేళ్లుగా బ్రేక్
- రైతులు మళ్లీ ఇష్టానుసారం ఎరువుల వాడకం
- కోల్పోతున్న భూసారం
- పట్టించుకోని పాలకులు

ఆదిలాబాద్‌రూరల్: అన్నదాతలు స్వల్ప పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ప్రభుత్వాలు పదే పదే చెబుతున్నాయి. మట్టి స్వభావం ఆధారంగా పంటలు సాగు చేయాలని సూచిస్తున్నాయి. ఇందుకోసం భూసార పరీక్షలు కీలకమని పేర్కొని క్షేత్రస్థాయిలోకి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చాయి. మండల పరిధిలోని వ్యవసాయ అధికారులకు సంబంధిత కిట్లను కూడా అందజేశారు. కొంతకాలం ఈ పరీక్షలు నిర్వహించినా నాలుగేళ్లుగా వాటి జాడ కనిపించకపోవడం గమనార్హం.

జాడలేని పరీక్షలు

జిల్లాలో వానాకాలంలో 5.72 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయి. గతంలో భూసార పరీక్షలను వేసవిలో సంబంధిత ఏఈవోల ద్వారా చేసే వారు. ఆ ఫలితాలకు అనుగుణంగా రైతులు పంటల సాగుకు ప్రాధాన్యం ఇచ్చేవారు. అయితే నాలుగేళ్లుగా వీటి ఊసే ఎత్తడం లేదు. ఫలితంగా రైతులు తమకు తోచిన విధంగా ఎరువులను వినియోగిస్తున్నారు. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గతంలో ప్రభుత్వం ఏటా నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో పదెకరాలకు ఒక మట్టి నమూనా, వర్షాధారిత ప్రాంతాల్లో 25 ఎకరాలకు ఒక మట్టి నమూనా సేకరించి పరీక్షలు చేసి నేల పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేవారు. తదనుగుణంగా రైతులు ఎరువులను వాడే వారు. అయితే నాలుగేళ్లుగా వ్యవసాయ శాఖ భూసార పరీక్షల కార్యాచరణను రూపొందించడం లేదు.

మూలకు చేరిన పరికరాలు

ప్రభుత్వం 2018లో భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.1.30 లక్షల విలువైన కిట్‌ను ఏఈవోలకు అందించారు. అప్పట్లో రైతు వేదికలు లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వాటిని మూలన ఉంచి నిర్వహించారు. రైతు వేదికలు నిర్మించాక అందులోకి మార్చారు. 2020 వరకు ఈ పరీక్షలు సజావుగా సాగాయి. అనంతరం రసాయనాలు లేక మూలనపడ్డాయి. ప్రస్తుతం ఎలాంటి భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. ప్రభుత్వం స్పందించి భూసార పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

బడ్జెట్ లేక ఆలస్యం..

కొన్నేళ్లుగా భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. బడ్జెట్ లేకపోవడం కారణం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పరీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి

ఎంపీ సీటు గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జోగు రామన్న

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

తలమడుగు: ఆదిలాబాద్ ఎంపీ సీటును భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మండలంలోని రుయ్యాడి గ్రామంలో బోథ్ నియోజవర్గంలోని తాంసి, తలమడుగు, భీంపూర్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీరాముని పేరు చెప్పుకొని బీజేపీ ఓట్ల రాజకీయం చేస్తుందని ఆరోపించారు. శ్రీరాముని మొక్కుతాం.. బీజేపీని తొక్కేస్తామని అన్నారు. గడిచిన పదేళ్లలో ప్రజలను మోసం చేయడం తప్ప ఆ పార్టీ చేసింది ఏమీ లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ, అన్ని రంగాలో వెనుకబడ్డ ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని, తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. పదవుల కోసం నాయకులు పార్టీలు మారినా.. కార్యకర్తలెవరు పార్టీలు మారరని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇందులో పార్టీ నాయకులు వెంకటేశ్, కేదేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అభిరామ్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ చంటి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- పట్టుబడుతున్న మద్యం, నగదు
- 'సరిహద్దు'లో ముమ్మర తనిఖీలు
- 27 రోజుల్లోనే రూ.21.33లక్షలు పట్టివేత

నిఘా కట్టుదిట్టం



జైనథ్ మండల కేంద్రంలో ఎఫ్‌ఎస్‌టీ టీం స్వాధీనం చేసుకున్న రూ.3,06,300నగదు (ఫైల్)

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నిఘా కట్టుదిట్టం చేశారు. అక్రమ మద్యం, నగదు తరలింపు కట్టడి చేయాలని జిల్లా యంత్రాంగం సంకల్పించింది. ఆ దిశగా ప్రత్యేక చెక్‌పోస్టులతో పాటు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను ఇప్పటికే ఏర్పాటు చేసింది. తనిఖీలు ముమ్మరం కావడంతో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నగదు రూ.లక్షల్లో పట్టుబడుతుంది. అలాగే అక్రమంగా తరలిస్తున్న, విక్రయిస్తున్న మద్యాన్ని సైతం స్వాధీనం చేసుకుంటున్నారు. అయితే గ్రామాల్లో మాత్రం బెల్టుషాపులు ఇంకా యథేచ్ఛగా నిర్వహిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు ముమ్మరం

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో మద్యం, నగదు అక్రమంగా తరలించకుండా యంత్రాంగం ఫోకస్ పెంచింది. జిల్లాకు మహారాష్ట్ర సరిహద్దునే ఉండటంతో అక్కడి నుంచి నగదు, డబ్బు తరలించకుండా ఉండేలా జిల్లాలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జైనథ్ మండలం భోరజ్ ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుతో పాటు ఆనంద్‌పూర్, పెండల్వాడ, బోథ్ మండలంలో ఘన్‌పూర్, తలమడుగు మండలంలో లక్ష్మీంపూర్, బేల మండలంలో శంకర్‌గూడ, గాదిగూడ మండలంలో మేడిగూడలో ఏర్పాటు చేశారు. వీటితో పాటు సి–విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్లకు వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించేలా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సైతం నియమించింది. దీంతో తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ షురూ కానుండటంతో నిఘా మరింత కట్టుదిట్టమయ్యే అవకాశముంది.

బెల్టు జోరు ఆగలే..!

ఆయా చెక్‌పోస్టులతో పాటు ప్రత్యేక బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ జిల్లాలో బెల్టు దుకాణాల నిర్వహణ మాత్రం ఆగడం లేదు. ఏజెన్సీ, మైదాన ప్రాంతం, పల్లె, పట్టణమనే తేడా లేకుండా దాదాపు ప్రతి గ్రామంలో బెల్టుషాపులను నిర్వహిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు వాటిపై చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో తలమడుగు మండలంలోని ఓ గ్రామంలో మహిళలే ఏకంగా బెల్టుషాపుపై దాడి చేసి మద్యాన్ని ధ్వంసం చేయడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రూ.21.33లక్షల నగదు.. రూ.29 లక్షల మద్యం పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న ప్రకటించింది. అదే రోజు నుంచి కోడ్ అమల్లోకి రావడంతో యంత్రాంగం రంగలోకి దిగి తగు చర్యలు చేపట్టింది. ప్రత్యేక చెక్‌పోస్టుల్లో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులను నియమించారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.50వేలకు మించి తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.21.33లక్షల నగదు పట్టుబడింది. అలాగే మహారాష్ట్ర నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న, జిల్లాలో అక్రమంగా విక్రయిస్తున్న 7,289 లీటర్ల వివిధ రకాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.29,36,382 ఉంటుందని అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు మద్యం, నగదు కలిపి రూ.50,69,382 పట్టుకున్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్ వరకు నిఘా మరింత కట్టుదిట్టం కానున్న నేపథ్యంలో మరింత పెద్ద మొత్తంలో నగదు, మద్యం పట్టుబడే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

నిఘా మరింత కట్టుదిట్టం చేస్తాం



ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నుంచే జిల్లాలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. వీటితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు కూడా జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపడుతున్నాయి. అక్రమ మద్యం, నగదు తరలించకుండా ప్రత్యేక నిఘా ఉంచాం. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే 18వ తేదీ నుంచి ఈ నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తాం. చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం(ఎస్‌ఎస్‌టీ)లను సైతం అదనంగా రంగంలోకి దింపుతాం. ప్రజలు కూడా ఎన్నికలు ముగిసే వరకు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దు. అక్రమంగా మద్యం తరలించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

– గౌస్ ఆలం, ఎస్పీ

90 శాతం గాలికుంటు నివారణ టీకాలు పూర్తి

- జిల్లా పశువైద్యాధికారి కిషన్



రిజిస్టర్లను పరిశీలిస్తున్న కిషన్

తలమడుగు: వేసవిలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామని, ఇప్పటి వరకు 90శాతం పూర్తి చేసినట్లు జిల్లా పశువైద్యాధికారి కిషన్ అన్నారు. మండలంలోని సుంకిడి పశువైద్య సబ్ సెంటర్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులంతా తమ పశువులకు తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు. ప్రతీ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే వేసవిలో పశువులకు గ్రాసం కొరత లేకుండా సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందిస్తున్నామని, కావాల్సిన రైతులు సంబంధిత పశు వైద్యశాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఇందులో మండల పశు వైద్యాధికారి దూద్రం రాథోడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సదస్సు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో ఈ నెల 13న(శనివారం) నిర్వహించనున్న వామపక్షాల జిల్లా సదస్సు జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ, మతోన్మాద, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు దర్శనాల మల్లేశ్, అరుణ్‌కుమార్, జగన్‌సింగ్, వెంకట్ నారాయణ, దత్తాత్రి, గణేశ్, కిరణ్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు గుడిపడ్వ పంచమి ఉత్సవాలు

బేల: మండలంలోని కాప్సి(బి) గ్రామంలో ఆధ్యాత్మిక గురువు నానాజీ మహరాజ్ గుడిపడ్వ పంచమి ఉత్సవాలను శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకం, మహాప్రసాద అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి 8గంటలకు భజన పోటీలు ఉంటాయని తెలిపారు. ఆదివారం వేకువజామున పల్లకీ శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 30న నిర్వహించే పీడిత వర్గాల విముక్తి ప్రదాతల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ కోరారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కేంద్రంలో శుక్రవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడారు. పూలే, అంబేద్కర్, కాన్షీరామ్‌తో పాటు అనేక మంది మహనీయులు ఈ నెలలోనే జన్మించారని పేర్కొన్నారు. వారిని స్మరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఇందులో పార్టీ నాయకులు సీహెచ్.వెంకటేష్, అశోక్, రాజేశ్వర్, శేఖర్, లక్ష్మణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తవ్వకాల్లో బయటపడ్డ నాడీ గణపతి



నాడీ గణపతికి పూజలు చేస్తున్న భక్తులు..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శ్రీరాజ శ్యామల ఆలయ ప్రాంగణంలో భూమి చదును చేస్తుండగా స్వయంభూ నాడీ గణపతి విగ్రహం లభ్యమైనట్లు శివరాజ యోగ కృష్ణస్వామి తెలిపారు. ఉగాది తర్వాత అమ్మవారి వసంత నవరాత్రి ఉత్సవాల్లో చవితి రోజు ఈ 5 అడుగుల నాడీ గణపతి విగ్రహం లభించడం శుభ సూచకమన్నారు. చవితి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో స్థిర ప్రతిష్టాపన చేస్తామని చెప్పారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలో నాగమ్మ చెరువు నుంచి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై చంద్రమోహన్ శుక్రవారం పట్టుకున్నారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్లు కనిపించడంతో డ్రైవర్లను విచారణ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని పోలీస్‌స్టేషన్ తరలించామని ఎస్సై తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు.

బాసర రైల్వేస్టేషన్‌లో చోరీ

భైంసా: బాసర రైల్వే స్టేషన్‌లో శుక్రవారం దొంగతనం జరిగింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన ఓ కుటుంబం గురువారం బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రాత్రికి బాసర స్టేషన్‌లోని వెయిటింగ్ రూమ్‌లో వీరంతా నిద్రపోయారు. ఈ కుటుంబంలో ముగ్గురు అంధులే. నిద్రిస్తున్న సమయంలో దొంగలు వీరివద్ద ఉన్న పత్రాలు, నగదును దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం వారి వద్ద నగదు కనిపించలేదు. డబ్బులు పోగొట్టుకున్న ఈ కుటుంబీకులు తిరుపతికి వెళ్లలేక ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ విషయమై రైల్వే పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగతనాలు జరుగడం గమనార్హం.

ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి

కడెం: ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఊరే లక్ష్మి–రాజన్న దంపతుల కుమారుడు శేఖర్(13) స్నేహితులతో కలిసి వెళ్లాడు. ట్రాక్టర్ ఎక్కుతుండగా ముందు (ఇంజిన్) భాగం వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. వెంటనే శేఖర్‌పై నుంచి ట్రాక్టర్ టైర్లు ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం వచ్చి పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామానికి చెందిన కొండేటి సంజీవ్ (45) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. సంజీవ్ కుటుంబ కలహాల కారణంగా అతడి భార్య గత నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. నెల రోజులైనా భార్య రావడం లేదని సంజీవ్ మనస్తాపం చెంది ఈ నెల 9న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొం దుతూ సంజీవ్ గురువారం రాత్రి మృతిచెందినట్లు పేర్కొన్నారు.

సమయం లేదు మిత్రమా..!

- నూతన ఓటు నమోదుకు మరో 3 రోజులే..
- రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసే అవకాశం
- ఈ నెల 15 ముగియనున్న గడువు





ఓటరు నమోదు పోర్టల్ ఇదే

నియోజకవర్గాల వారీగా ఓటర్లు, పోలింగ్‌కేంద్రాల వివరాలు..

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
నిర్మల్	2,54,681	306
ముథోల్	2,50,978	311
ఖానాపూర్	2,21,837	305
ఆదిలాబాద్	2,43,535	290
బోథ్	2,10,915	302

నిర్మల్‌ఖిల్లా: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వచ్చేనెల 13న జరగనుంది. అర్హులైన కొత్త ఓటర్లందరూ తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఈనెల 15 వరకు చివరి గడువుగా ఉంది. అంటే మరో మూడు రోజుల్లో ఓటు నమోదుకు అవకాశం ముగియనుంది. ఇప్పుడు ఓటు నమోదు చేసుకున్నా లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. గత శాసనసభ ఎన్నికల్లో అర్హులై ఉండి కూడా ఓటు నమోదు చేసుకోకపోవడంతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం లేకపోయిన వారు, ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు కూడా ప్రస్తుతం ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

యువతరం కదలాలి...

ప్రస్తుతం డిగ్రీ కోర్సులు, ఇంజినీరింగ్ చదువుతున్న వారు 18 ఏళ్లు నిండిన వారై ఉంటారు. అయితే ఓటరు జాబితాలో చోటు సంపాదించుకోవడానికి ఇదే సరైన తరుణం. కొత్త ఓటరుగా ఓటును నమోదు చేసుకుంటే వచ్చేనెల నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. దీనిపై జిల్లాస్థాయి అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా యువ ఓటర్లుగా తమ హక్కును వినియోగించుకోవచ్చు. లోక్‌సభ ఎన్నికల ఓటర్ల అనుబంధ జాబితాను ఈనెల 25న ప్రదర్శించనున్నారు. ఓటరు జాబితాలో తమ పేరు లేనట్లయితే ఈ మూడు రోజుల్లోగా నమోదు చేసుకోవచ్చు.

ఓటు నమోదు ఇలా...

ముందుగా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో చూసుకోవాలి. గతేడాది నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో దూర ప్రాంతాల నుంచి సొంత స్థలాలకు వచ్చిన ఓటర్లు కొందరు తమ జాబితాలో పేరు లేదని తెలియడంతో నిరాశకు గురయ్యారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ముందుగా జాబితాను సరిచూసుకోవాలి. ప్రజాస్వామ్యయుత ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చు. ఇందుకుగాను 18 ఏళ్లు నిండిన వారందరూ అర్హులే. 2006 మార్చి 31 కంటే ముందు పుట్టిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇందుకు ఫారం-6 నింపి తగిన ధ్రువీకరణ పత్రాల కాపీలను పాస్ ఫొటోలను జతపరిచి బూత్ లెవెల్ అధికారికి అందించాలి. లేదా మీ చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ ద్వారా, దగ్గర్లోని ఆన్‌లైన్ సెంటర్ లోనైనా https//:nvsp.in, https//:ceotelangana. nic.in అనే వెబ్‌సైట్‌లలో లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్ జాబితాలో పేరు గల్లంతైన వారు, అర్హత ఉండి కూడా నేటికీ ఓటరు జాబితాలో పేరు లేని వారంతా దరఖాస్తు చేసుకోవచ్చు.

క్షేత్రస్థాయి పరిశీలనలో బీఎల్వోలు..

18 ఏళ్లు నిండి ఓటరు జాబితాలో పేరులేని యువతీ, యువకుల కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో ఆరా తీస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని ముథోల్, ఖానాపూర్, నిర్మల్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని మొత్తం 922 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న బూత్‌ల స్థాయి నుంచి యువతీ, యువకులకు అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదుపై చైతన్యం కలిగిస్తున్నారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం

- ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్
- గాదిగూడలో 18 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయితో ఎస్సైలు రవికిరణ్, మహేశ్‌కుమార్

నార్నూర్: ఏజెన్సీలో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తుందని డీఎస్పీ నాగేందర్ అన్నారు. గాదిగూడ మండలంలో శుక్రవారం భారీగా గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు మండలంలోని చిత్తగూడ, కునికాస, కొటాల గ్రామాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో గంజాయి లభించిన ఐదుగురితోపాటు ఆదిలాబాద్‌కు చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.4.50లక్షల విలువ చేసే 18కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనంతో పాటు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, సాగుచేసినా, నిలువ ఉంచినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ రహీంపాషా, ఎస్సైలు రవికిరణ్, మహేశ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రూ.5 లక్షలు పట్టివేత



పట్టుబడ్డ నగదుతో పోలీసులు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

సారంగాపూర్: మండలంలోని కొట్ల(బి)–సారంగాపూర్ గ్రామాల మధ్య మలక్‌చించోలి ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన గోస్కుల పోశెట్టి వద్ద రూ.3.50 లక్షలు, దేవితండాకు చెందిన రాథోడ్ ప్రహ్లాద్ వద్ద రూ.1.50 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో నగదును కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ అధికారులకు అందజేశామని పేర్కొన్నారు.

లోకేశ్వరంలో రూ.90 వేలు..

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చే స్తుండగా మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన నాగేశ్ వద్ద రూ.90 వేల నగదు లభించిందని ఎస్సై రాజు తెలిపారు. ఈ నగదుకు ఎటువంటి ఆధారాలు చూపక పోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రూ.1.16లక్షల నగదు సీజ్

నేరడిగొండ: బోథ్ మండలం ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఎలాంటి రశీదు, పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1లక్ష 16వేలను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. తనిఖీ సమయంలో ఓ కారులో ఈ నగదు పట్టుబడింది. మహారాష్ట్ర నుంచి తెలంగాణ సరిహద్దులోకి కారులో వస్తుండగా నగదు పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

డ్రైవర్‌గా చేరిన మూడు రోజులకే..

- ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి
- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల డిమాండ్



దాస్లరాజు(ఫైల్)



మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు

కుంటాల: ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని ఓలా శివారులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన దాస్ల రాజు(40) కాయకష్టం చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశాడు. ఉగాది సందర్భంగా స్వగ్రామంలో ఓలాలో నరేందర్ అనే యజమాని వద్ద డ్రైవర్‌గా పనిలో చేరాడు. శుక్రవారం ఓ రైతు మొక్కజొన్నను నూర్పిడి చేయగా మెదన్‌పూర్ శివారు కెనాల్ ప్రాంతంలో కల్లంలో అరబెట్టేందుకు ట్రాక్టర్‌లో తీసుకెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడిపోయాడు. ఈ ఘటనలో ముఖం, తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు మృతిపై అనుమానాలు ఉన్నాయని విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఎస్సై రజనీకాంత్ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపడతామని హామీ ఇవ్వడంతో శాంతించారు. రాజుకు భార్య రుక్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

ఇంద్రాదేవి ఆలయం.. సమస్యలమయం

- తాగునీటికి తీవ్ర ఇక్కట్లు
- నైవేద్యాల తయారీకి తప్పని తిప్పలు
- ఇబ్బందుల్లో భక్తులు



ఉన్న ఒక్క చేతి పంపు వద్ద అవస్థలు పడుతున్న భక్తులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం.. నిత్యం భక్తుల పూజలందుకునే ఇంద్రాదేవి ఆలయంలో సమస్యలు తిష్టవేశాయి. కనీస సౌకర్యాలు లేక పూజలకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం చైత్ర మాసం కావడంతో పూజలకు భారీగా తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఉన్న ఒక్క చేతి పంపు వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి. తాగునీటి కోసం చుట్టు పక్కల ఇళ్లలో సేకరించాల్సి వస్తోందని భక్తులు పేర్కొంటున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సరిపడా స్థలం లేక వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఇక్కట్ల నడుమ వంటలు చేసి ఇంద్రాదేవికి నైవేద్యాలు సమర్పిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఆలయంలో నీటి సౌకర్యంతో పాటు వంటలు చేయడానికి ఆలయానికి ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.



బయటనుంచి నీటిని తీసుకొస్తున్న యువతులు



మార్కెట్‌యార్డులో వంటలు చేస్తున్న ఆదివాసీలు



అభివృద్ధికి నోచుకోని ఇంద్రాదేవి ఆలయ స్థలం

శబరిమలలో నిర్మల్‌వాసి మృతి

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని చింతకుంట వాడకు చెందిన తమ్మరాశి రాజన్న (67) శబరిమలలో మృతి చెందాడు. విషు పూజలో పాల్గొనేందుకు రెండు రోజుల క్రితం అల్లుడు, మనుమళ్లతో కలిసి శబరిమల వెళ్లాడు. గురువారం అయ్యప్ప దర్శనం కోసం చిన్నపాదం నడుస్తూ... అస్వస్థతకుగురై మృతి చెందాడు. రాజన్నకు భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లందరికీ పెళ్లి కావడంతో దంపతులు ఇద్దరే ఉంటున్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

ఎదులాపురం: మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం .. సంచార జాతికి చెందిన చౌహన్ సంతోశ్ (40) కాలకృత్యాలు తీర్చుకోవడంలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు పట్టణంలోని సాత్నాల ఓల్డ్ క్వార్టర్స్ వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు క్వార్టర్స్ సమీపంలోని మురుగు కాలువలో పడ్డాడు. అందులోని బురదలో చిక్కుకొని బయటకు రాలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్సై నారా యణ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఇంద్రాదేవి' బాటలో..



ఎడ్లబండ్లతో ఇంద్రాదేవి ఆలయానికి వస్తున్న వాల్గొండ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: చైత్రమాసం సందర్భంగా ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వాల్గొండ గ్రామస్తులు శుక్రవారం ఎడ్లబండ్లతో ఆలయానికి చేరుకున్నారు. అలాగే ఉట్నూర్, నార్నూర్, గుడిహత్నూర్, జైనూర్ మండలాల ఆదివాసీలు సైతం ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నెల రోజుల పాటు పూజలు కొనసాగుతాయని ఆలయ మహరాజ్ సూర్యరావ్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆదివాసీ పెద్దలు కినక లచ్చు పటేల్, కినక జుగాదిరావ్, మెస్రం సోమేశ్వర్ తదితరులున్నారు.



నైవేద్యాలు, సంప్రదాయ వాయిద్యాలతో ఆలయానికి వస్తున్న ఆదివాసీలు

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

దస్తురాబాద్: అదుపుతప్పి కారు బోల్తా పడిన సంఘటన మండలంలోని బుట్టాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కారు బుట్టాపూర్ శివారు వాగు సమీపంలోని మూల మలుపు వద్ద వేగంగా రావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గమనించి వెంటనే క్షతగాత్రులను కారులో నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు



గాయపడిన యువకుడు

జన్నారం: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురు యువకులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నిర్మల్ జిల్లా బీర్నందికి చెందిన యువకులు ద్విచక్ర వాహనంపై జన్నారం మండలంలోని ఓ శుభాకార్యానికి వస్తుండగా, ఇందన్‌పల్లి గ్రామ సమీపంలో జన్నారం నుంచి ఇందన్‌పల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ వాహనాలపై వెళ్తున్న బీర్నందికి చెందిన పెంద్రం తిరుపతి, సుదర్శన్, సంతోష్‌లు, జన్నారానికి చెందిన అనీల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఏఎస్సై రాథోడ్ బిక్కులాల్ సంఘటన స్థలానికి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించామని, ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్సై తెలిపారు.

హథ్‌గాంలో మద్యం పట్టివేత



హథ్‌గాంలో పట్టుకున్న మద్యం

లోకేశ్వరం: మండలంలోని హథ్‌గాం గ్రామానికి చెందిన నాగభూషణం బెల్ట్ షాపులో మ ద్యం అమ్ముతుండగా లోకేశ్వరం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై రాజు తెలి పిన వివరాల ప్రకారం.. హథ్‌గాంలో నాగభూషణం అక్రమంగా మద్యం అమ్ముతున్న ట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేశా రు. అతని వద్ద రూ.5,500 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. నాగభూషణంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో అ క్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై పోలీ సులు శుక్రవారం దాడి చేశారు. అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సందీప్ తెలిపిన వివరా ల ప్రకారం.. ఎల్వి గ్రామానికి చెందిన సాయినాథ్‌గౌడ్ బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4,188 విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని ఎక్సైజ్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.